సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 13 । మార్చి । 2024



టన్ను చీనీ రూ.24 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేలు, కనిష్టంగా రూ.10 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.12
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.12, కనిష్టంగా రూ.4, సరాసరిన రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

రంజాన్ వేళలు

బుధవారం	గురువారం
ఇఫ్తార్ 6.33	సెహరి 5.15



న్యూస్‌రీల్

ఖాద్రీశుని హుండీ ఆదాయం రూ.78 లక్షలు



హుండీలు లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీశునికి హుండీ కానుకల ద్వారా రూ.78 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం ఆలయ, బ్యాంక్ అధికారులు లెక్కించారు. 60 రోజులకు గాను రూ.78,71,911 నగదు, కొంతమేర విదేశీ కరెన్సీ వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈసారి హుండీ ఆదాయం పెరిగినట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో దేవదాయశాఖ జిల్లా అధికారి నరసింహరాజు, కెనరా బ్యాంక్ మేనేజర్ మధు, బ్యాంక్ సిబ్బంది, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్ష



పెనుకొండ పరీక్షా కేంద్రం తనిఖీ చేసి బయటకు వస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి: ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. మంగళవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫిజిక్స్–1, ఎకనామిక్స్ పేపర్–1 పరీక్షలు జరిగాయి. జిల్లాలోని 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా, 465 మంది గైర్హాజరైనట్లు ఇంటర్మీడియెట్ విద్య అధికారి (డీఐఈఓ) రఘునాథరెడ్డి తెలిపారు. జనరల్‌కు సంబంధించి 11,033 మందికి గాను 10,668 మంది హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,534 మంది విద్యార్థులకు గాను 1,434 మంది హాజరయ్యారని తెలిపారు. మొత్తం 465 మంది గైర్హాజరైనట్లు ఆయన వెల్లడించారు.

పరీక్షల కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ అరుణ్‌బాబు మంగళవారం తనిఖీ చేశారు. సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు.

నేడు లబ్ధిదారులతో ప్రధాని ముఖాముఖి

పుట్టపర్తి అర్బన్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్‌బీసీఎఫ్‌డీసీ తదితర ఆర్థిక సంస్థలు, వివిధ కార్పొరేషన్‌ల ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు ముఖాముఖి కానున్నారు. ఢిల్లీ నుంచి ప్రధాని వర్చువల్‌గా కార్యక్రమం నిర్వహించనుండగా, స్థానికంగా కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సౌరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ అరుణ్‌బాబు, జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు పాల్గొంటారన్నారు.

క్వింటా చింతపండు రూ.25 వేలు

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో క్వింటా చింతపండు గరిష్టంగా రూ.25 వేలు ధర పలికింది. మార్కెట్‌కు మంగళవారం 2,978 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. అందులో కరిపులి రకం క్వింటా గరిష్టంగా రూ.25 వేలు, రూ.కనిష్టంగా 8,800 మేర పలికిందన్నారు. ఫ్లవర్ రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.10 వేలు, కనిష్టంగా రూ.4,100 ప్రకారం క్రయ విక్రయాలు జరిగినట్లు ఆయన వెల్లడించారు.

ఎండుమిర్చి @ 22 వేలు



మార్కెట్‌కు వచ్చిన మిర్చి

హిందూపురం అర్బన్: స్థానిక వ్యవసాయ మార్కెట్ ఎండుమిర్చి కొనుగోళ్లతో కళకళలాడుతోంది. మంగళవారం 110 క్వింటాళ్ల సరుకు రాగా, ఈ–నామ్ పద్ధతిలో వేలం వేసినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. అందులో మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.22 వేలు, రెండో రకం మిర్చి క్వింటా రూ.9 వేలు, మూడో రకం క్వింటా రూ.7 వేల మేర పలికినట్లు ఆయన వెల్లడించారు.

రైతన్నకు సర్కారు సాయం



రైతు వేసే ప్రతి అడుగులోనూ వైఎస్ జగన్ సర్కార్ తోడుగా నిలుస్తోంది. పంటల సాగుకు కావాల్సిన పెట్టుబడి మొదలు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందిస్తోంది. పంట పండితే మద్దతు ధర ఇస్తోంది..పంట ఎండినా పంటలబీమా, ఇన్‌పుట్ సబ్సిడీతో ఆదుకుంటోంది. అలాగే సున్నావడ్డీతో రూ.లక్షలోపు రుణం తీసుకున్న రైతుల వడ్డీని ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇలా సాగుకు సకలం అందిస్తూ అన్నదాత ఇంట ఆనందం నింపుతోంది.

2019 నుంచి జిల్లాలోని రైతులకు చేకూరిన లబ్ధి ఇలా....

పథకం పేరు	లబ్ధి పొందిన రైతులు	మొత్తం (రూ.కోట్లలో...)
వైఎస్సార్ రైతుభరోసా	2,79,556	1,767.09
సున్నా వడ్డీ పంటరుణాలు	1,71,275	67.65
వైఎస్సార్ ఉచిత పంటల బీమా	2,96,541	718.57
ఇన్‌పుట్ సబ్సిడీ	12,099	16.21

- సాగుకు సాయంగా నిలిచిన సీఎం వైఎస్ జగన్
- రైతు భరోసా ద్వారా ఏటా ఒక్కో రైతు ఖాతాలో రూ.13,500
- రూ.లక్షలోపు రుణాలకు సున్నా వడ్డీ
- సాగు చేసిన ప్రతి పంటకూ ఉచిత బీమా
- విపత్తులతో పంటకు నష్టం జరిగితే ఇన్‌పుట్ సబ్సిడీ

కదిరి: పాదయాత్రలో రైతుల కష్టాలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకున్నారు. వివిధ పథకాలతో అండగా నిలిచారు. చంద్రబాబు పాలనలో ప్రోత్సాహం లేక కాడి వదిలేసిన రైతులతోనూ వ్యవసాయం చేయించి తమది రైతు ప్రభుత్వమని నిరూపించారు. రైతు భరోసా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చి ఎరువులు, విత్తనాలు స్థానికంగానే అందిస్తుండగా రైతులు రెట్టించిన ఉత్సాహంతో పంటలసాగు చేస్తున్నారు.

రైతన్నకు భరోసా

'వైఎస్సార్ రైతు భరోసా'తో రైతుకు పెట్టుబడి సాయం అందిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఏటా ఈ పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ.13,500 చొప్పున ఖాతాలో జమ చేస్తోంది. ఈ ఐదేళ్లలో జిల్లాలోని కదిరి నియోజకవర్గంలోని 46,838 మంది రైతులకు రూ.298.13 కోట్లు, ధర్మవరంలో 41,671 మందికి రూ.262.82 కోట్లు, పుట్టపర్తిలో 45,824 మందికి రూ.290.74 కోట్లు, హిందూపురంలో 23,422 మందికి రూ.148.93 కోట్లు, మడకశిరలో 45,763 మందికి రూ.287.71 కోట్లు, పెనుకొండలో 44.757 మందికి రూ. 281.93 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలోని 31,718 మంది రైతులకు రూ.196.83 కోట్లు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి సీఎం జగన్ జమ చేశారు.

క్రమం తప్పకుండా సున్నా వడ్డీ రాయితీ

రూ.లక్ష లోపు పంట రుణాలు తీసుకొని సమయానికి తిరిగి చెల్లించిన అన్నదాతలకు 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా కదిరి నియోజకవర్గంలోని 39,199 మంది రైతులకు రూ.14.32 కోట్లు, ధర్మవరంలో 21,230 మందికి రూ.11.08 కోట్లు, పుట్టపర్తిలో 40,351 మందికి రూ.12.76 కోట్లు, హిందూపురంలో 10,670 మందికి రూ.3.63 కోట్లు, మడకశిరలో 25,337 మందికి రూ.11.45 కోట్లు, పెనుకొండలో 25,390 మందికి రూ.8.85 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలోని 9,098 మంది రైతులకు రూ.5.56 కోట్ల రాయితీ లభించింది.

బీమాతో ధీమా

డా.వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులపై పైసా కూడా భారం పడకుండా నోటిఫైడ్ పంటలకు 100 శాతం బీమా కల్పిస్తోంది. ఈ పథకం ద్వారా 2019 నుంచి ఇప్పటి దాకా కదిరి నియోజకవర్గంలోని 55,755 మంది రైతులకు రూ.107.53 కోట్లు, ధర్మవరంలో 47,870 మందికి రూ.191.48 కోట్లు, పుట్టపర్తిలో 67,045 మందికి రూ.78.8 కోట్లు, హిందూపురంలో 17,415 మందికి రూ.36.22 కోట్లు, మడకశిరలో 38,198 మందికి రూ.79.29 కోట్లు, పెనుకొండలో 24,276 మందికి రూ.99.29 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో 60,118 మంది రైతులకు రూ.125.96 కోట్లు లబ్ధి చేకూరింది.

రైతు నష్టపోకూడదని ఇన్‌పుట్ సబ్సిడీ

వర్షాభావ పరిస్థితులు, ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోయిన రైతులను వైఎస్ జగన్ ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీతో ఆదుకుంటోంది. గత ప్రభుత్వాలకు భిన్నంగా పంట నష్టపోయిన వివరాలను యుద్ధ ప్రాతిపదికన తెప్పించుకుని నివేదికలు అందిన వారం రోజుల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ మొత్తాన్ని నేరుగా రైతు ఖాతాలో జమ చేస్తోంది. ఈ పథకం ద్వారా జిల్లాలోని కదిరి నియోజకవర్గంలో 4,274 మంది రైతులకు రూ.3.15 కోట్లు, ధర్మవరంలో 1,401 మందికి రూ.3.09 కోట్లు, పుట్టపర్తిలో 2,360 మందికి రూ.2.76 కోట్లు, హిందూపురంలో 292 మందికి రూ.20 లక్షలు, మడకశిరలో 937 మందికి రూ.1.04 కోట్లు, పెనుకొండలో 1,754 మందికి రూ.2.52 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో 1,978 మంది రైతులకు రూ.3.46 కోట్ల మేర లబ్ధి కలిగింది.

రైతన్నల ప్రభుత్వమిది



జగనన్న ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలుస్తోంది. గతంలో విత్తన వేరుశనగ కావాలంటే రాత్రంతా పంపిణీ కేంద్రాల వద్ద జాగరణ చేసేవాళ్లం. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనం అందిస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే ఇది రైతు సంక్షేమ ప్రభుత్వం. సీఎం జగన్ తండ్రిని మించిన తనయుడు అన్పించుకున్నారు.

–కోటేశ్వరరెడ్డి, రైతు, ముదిగుబ్బ మండలం

ఈ–క్రాప్ కింద నమోదు చేస్తాం



సాగుచేసిన ప్రతి ఎకరా ఈ–క్రాప్ కింద నమోదు చేస్తున్నాం. దీంతో ఏయే పంటలు సాగులో ఉన్నాయో సులభంగా తెలిసిపోతుంది. వర్షాభావం, తుపాను వల్ల పంట నష్టపోతే వెంటనే వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపగానే పరిహారం అందుతోంది. 5 సెంట్ల భూమి ఉన్న రైతుకు సైతం రూ.13,500 చొప్పున ప్రభుత్వం ఏటా పెట్టుబడి సాయం అందిస్తోంది.

–డా.వైపీ సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

'వందేభారత్'కు ఘన స్వాగతం



ధర్మవరం రైల్వేస్టేషన్‌లో నిలిచిన వందే భారత్ రైలు

ధర్మవరం అర్బన్: కలబురిగి–బెంగళూరు మధ్య నూతనంగా ప్రవేశపెట్టిన వందేభారత్ రైలుకు ధర్మవరంలో మంగళవారం స్థానికులు ఘన స్వాగతం పలికారు. స్టేషన్ మాస్టర్ నరసింహనాయుడు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు జెండా ఊపి రైలును ప్రారంభించారు. జిల్లా మీదుగా నడిచే ఈ రెండో వందే భారత్ రైలును చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలువురు వందే భారత్ రైలు వద్ద సెల్ఫీలు దిగి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ వందే భారత్ రైలు ప్రాధాన్యత, ప్రయాణికుల కోసం రైలులో కల్పించిన సౌకర్యాలు, ఉపయోగాలను వివరించారు.

డ్రిప్, స్ప్రింక్లర్లపై నివేదిక అందించండి



మాట్లాడుతున్న అనంత పీడీ రఘునాథరెడ్డి, చిత్రంలో శ్రీసత్యసాయి జిల్లా పీడీ సుదర్శన్

అనంతపురం అగ్రికల్చర్: డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాల మంజూరు లక్ష్యం పూర్తి చేసి తుది తనిఖీల నివేదిక (ఫైనల్ ఇన్‌స్పెక్షన్ రిపోర్టు) వెంటనే అందజేయాలని ఏపీఎంఐపీ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పీడీలు బి.రఘునాథరెడ్డి, సుదర్శన్ ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రాంతీయ ఉద్యాన శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. అనంతపురం జిల్లాలో ఇప్పటి వరకు 9,600 మంది రైతులకు 11,500 హెక్టార్లకు పరికరాలు ఇవ్వగా శ్రీసత్యసాయి జిల్లా పరిధిలో 6,200 మంది రైతులకు 7,200 హెక్టార్లకు పైగా డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేశామన్నారు. మంజూరు చేసిన ప్రతి రైతుకూ వెంటనే మెటీరియల్ సరఫరా చేసి పొలాల్లో బిగించాలని ఆదేశించారు. తుది పరిశీలన నివేదిక అందజేయాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ఏ మాత్రం అలసత్వం వహించకుండా వారం రోజుల్లో తుది నివేదిక సమర్పించాలని ఆదేశించారు. తోటబడి కార్యక్రమం కింద యాసిడ్ ట్రీట్‌మెంట్, పరికరాల పనితీరు, విడిభాగాలకు సంబంధించి అన్ని రకాలుగా రైతులకు చేయూత అందించాలన్నారు. సమావేశంలో ఏపీడీ జి.ఫిరోజ్‌ఖాన్, ఉద్యానశాఖ ఇన్‌చార్జి డీడీ నరసింహారావు, సూపరెండెంట్ ప్రసాద్, కంపెనీ డీసీవోలు, ఎంఐ ఇంజినీర్లు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కల్పించేందుకే కవాతు

- అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి



కేంద్ర సాయుధ బలగాలకు సూచనలిస్తున్న అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి

ధర్మవరం అర్బన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భద్రతపై ప్రజలకు భరోసా కల్పించేందుకే రేంజ్ పరిధిలోని వివిధ పట్టణాల్లో సాయుధ బలగాలతో కవాతు నిర్వహిస్తున్నట్లు అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం పట్టణంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీసుల కవాతును చేశారు. ఈ సందర్భంగా డీఐజీ అమ్మిరెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలు ప్రశాంతంగా వాతావరణంలో నిర్వహించేందుకు అందరూ సహకరించాలన్నారు. కేంద్ర సాయుధ బలగాలు పాటించాల్సిన ఎన్నికల నియమావళి, సమస్యలు ఏర్పడినప్పుడు తీసుకోవాల్సిన చర్యల గురించి ఈ సందర్భంగా డీఐజీ వివరించారు. ఎస్పీ మాధవ్‌రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ శ్రీనివాసులు, బీఎస్ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ గౌతమ్‌కుమార్, ఏఆర్ డీఎస్పీ విజయ్‌కుమార్, సబ్ డివిజన్‌లోని సీఐలు సుబ్రహ్మణ్యం, అశోక్‌కుమార్, యతీంద్ర, కృష్ణంరాజు, శివాంజనేయులు, ఎస్ఐలు, కేంద్ర సాయుధ బలగాలు పాల్గొన్నారు.

ప్రతి స్కూల్లోనూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు



సదస్సులో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

పుట్టపర్తి అర్బన్: క్రమ శిక్షణ, దేశభక్తిని పెంపొందించడం కోసం ప్రతి పాఠశాలలోనూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు నెలకొల్పేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఈఓ మీనాక్షి తెలిపారు. మంగళవారం పుట్టపర్తి మండలం జగరాజుపల్లి కేజీబీవీలో జిల్లా స్థాయి కేజీబీవీలు, మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇప్పటి వరకూ జిల్లాలో 80 పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లు ఉండగా, తాజాగా మరో 39 పాఠశాలల్లో అవగాహన సదస్సు అనంతరం యూనిట్లకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసినట్లు చెప్పారు. విద్యాశాఖ ఏడీ రామకృష్ణ, జిల్లా సెక్రెటరీ గిరిధర్, వైస్ ప్రెసిడెంట్ నాగరాజు గుప్తా తదితరులు మాట్లాడుతూ... రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న పాఠశాలల ఉపాధ్యాయులు, పీఈటీలకు వారం రోజులు శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించండి



కొట్నూరు పోలింగ్ కేంద్రం వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

హిందూపురం/రొద్దం/గోరంట్ల: ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పన పూర్తి కావాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులకు ఆదేశించారు. మంగళవారం ఆయన హిందూపురం నియోజకవర్గ పరిధిలోని మణేసముద్రం, కొట్నూరు, రొద్దం మండల పరిధిలోని కంబాలపల్లి, శ్యాపురం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. రెండురోజుల్లో పోలింగ్ కేంద్రాల్లో వసతులన్నీ కల్పించాలన్నారు. అనంతరం స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు 'బిట్' కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా హిందూపురం, మడకశిర, పెనుకొండ నియోజకవర్గాల కౌంటింగ్ ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. అక్కడి నుంచి గోరంట్ల వెళ్లిన కలెక్టర్.. స్థానిక న్యూ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఓట్ల లెక్కింపు కోసం కేటాయించిన గదులను పరిశీలించి అధికారులతో చర్చించారు.

నవీన్‌నిశ్చల్‌కు కీలక పదవి

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడిగా నియామకం
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వజ్ర భాస్కర్‌రెడ్డి



బి.నవీన్‌నిశ్చల్



వజ్ర భాస్కర్‌రెడ్డి

సాక్షి, పుట్టపర్తి: విధేయతకు వైఎస్ జగన్ పట్టం కట్టారు. ఏళ్లుగా పార్టీ జెండా మోస్తూ పటిష్టతకు కృషి చేస్తున్న బుక్కపట్నం నవీన్‌నిశ్చల్‌కు కీలక పదవి అప్పగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా అధ్యక్షుడిగా నియమించారు. పార్టీ అధ్యక్షుడి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం మంగళవారం సాయంత్రం ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది. ఇన్నాళ్లూ వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాలగుండ్ల శంకరనారాయణను అనంతపురం పార్లమెంటు సమన్వయకర్తగా నియమించిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన స్థానంలో జిల్లా అధ్యక్షుడిగా హిందూపురం నియోజకవర్గానికి చెందిన నవీన్‌నిశ్చల్‌కు పార్టీ పగ్గాలు అప్పజెప్పారు. ప్రస్తుతం ఆయన ఏపీ ఆగ్రోస్ చైర్మన్‌గా ఉన్నారు. అలాగే కదిరి నియోజకవర్గానికి చెందిన వజ్రభాస్కర్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈ సందర్భంగా నవీన్ నిశ్చల్, వజ్ర భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ఎంపికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. తమపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామన్నారు. జిల్లాలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.



తినుబండారాలు కొనుగోలు చేస్తున్న దృశ్యం

రంజాన్ శోభ

ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ మాసం ప్రారంభమైంది. మంగళవారం ఉదయమే సెహరీతో ఉపవాసాన్ని చేపట్టిన ముస్లింలు సాయంత్రం వేళ ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందుతో ముగించారు. తొలిరోజు జిల్లాలోని అన్ని పట్టణాల్లో మసీదులు కిటకిటలాడాయి. ముఖ్యంగా కదిరి, హిందూపురం పట్టణాల్లో రంజాన్ శోభ కనిపిస్తోంది.

– హిందూపురం టౌన్:



ప్రార్థనల అనంతరం రోజా విడుస్తున్న ముస్లింలు



మసీదు ఆవరణలో సామూహిక ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు



ఎండ తీవ్రత పెరిగిన నేపథ్యంలో తాటి ముంజల కొనుగోలు

క్లుప్తంగా

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

చెన్నేకొత్తపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎస్‌ఓ సువర్ణ మంగళవారం తెలిపారు. ఆరో తరగతి, ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనాథలు, బడి బయట పిల్లలు, మధ్యలో బడిమానేసిన వారు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీకి చెందిన పేద బాలికలు మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు విద్యార్థి, తల్లిదండ్రుల ఆధార్, బియ్యం కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్‌తో పాటు విద్యార్థిని పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు వెంట తీసుకెళ్లి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ప్రాధాన్యత



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

మడకశిరరూరల్: విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యం, విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి తెలిపారు. గౌడనహళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం కల్లుమర్రి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రపంచ అయోడిన్ డెఫిషియన్సీ డిజార్డర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్లు మాధుర్య, వినోద్‌కుమార్ విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ విద్యార్థుల్లో అయోడిన్ శాతం ఎంత ఉందో తెలుసుకోవడానికి శాంపిల్స్ సేకరించామన్నారు. గాయిటర్ (థైరాయిడ్ (గ్రంధి ఉబ్బడం) వ్యాధి రాకుండా అందరూ అయోడైజ్డ్ ఉప్పు వాడాలన్నారు. విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకోవాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటించాలన్నారు. ఎండ తీవ్ర అధికంగా ఉన్నందున ఎక్కువగా మంచినీరు సేవించాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సూపర్‌వైజర్ రామ్‌ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవనోపాధులకు ఆర్థిక చేయూత

పుట్టపర్తి అర్బన్: వివిధ కార్పొరేషన్ల ద్వారా జిల్లాలో 417 మంది లబ్ధిదారుల జీవనోపాధుల పెంపు కోసం పీఎం సురాజ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రూ.12.74 కోట్ల నిధులను ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో విడుదల చేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ అరుణ్‌బాబు హాజరవుతారన్నారు. బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఇందులో ఎస్సీ, ఎస్టీ, బీసీలు, సఫాయి కర్మచారులు, సెప్టిక్ ట్యాంక్ కార్మికులు తదితర లబ్ధిదారులకు ఈ కార్యక్రమం ద్వారా ప్రయోజనం చేకూరనున్నట్లు చెప్పారు.

పేదరికం లేని సమాజమే లక్ష్యం

- ఇంటిస్థలం రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు
- చేనేత కార్మికులకు ఇంటితో పాటు మగ్గం షెడ్‌కూ సాయం
- రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



ఇంటి స్థల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



భారీగా హాజరైన లబ్ధిదారులు

ధర్మవరం: పేదరికం లేని సమాజం నిర్మించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మవరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం జగనన్న కాలనీలు, వివిధ లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కలిగిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. పట్టణంలో మొత్తం 13,356మంది లబ్ధిదారులు ఉండగా.. తొలి విడతగా సిద్ధమైన ఆరు వేల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. అంతకు ముందు టీడీపీ మూకల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న గీతాంజలికి ఆత్మశాంతి కలగాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలో రాష్ట్రంలో సంక్షేమ జాతర సాగిందన్నారు. ఎన్నికల హామీల్లో 99 శాతం అమలు చేసి విశ్వసనీయత చాటుకున్నారన్నారు. చేనేత కార్మికులు అధికంగా నివసించే ధర్మవరం లాంటి ప్రాంతంలో ఇప్పటికే జగనన్న కాలనీల ద్వారా 13, 356 ఇళ్లు, టిడ్కో అపార్ట్‌మెంట్‌ల ద్వారా 14,440 ప్లాట్లు కేటాయించారన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.504 కోట్ల దాకా ఉంటుందన్నారు. పట్టణానికి అతి చేరువలో ఒకటిన్నర సెంట్ల స్థలంలో చేనేత కార్మికులకు ఇంటితో పాటు మగ్గం షెడ్ నిర్మించుకునేలా సాయం అందించినట్లు తెలిపారు. అంతేకాక నియోజకవర్గ వ్యాప్తంగా నవరత్నాల పథకాల ద్వారా ఐదేళ్లలో రూ.3,200 కోట్ల దాకా డీబీటీ పద్ధతిలో జమ చేశారన్నారు. మంచి జరిగి ఉంటేనే ఓటు వేయండని ప్రజలను కోరే దమ్మున్న నాయకుడు జగనన్న ఒక్కరేనన్నారు. టీడీపీ హయాంలో ఒక్క పేదకు కూడా ఇంటి పట్టా మంజూరు చేసిన పాపాన పోలేదని విమర్శించారు. పేదలకు సంక్షేమం అందించకుండా చంద్రబాబు సొంత సామాజికవర్గానికి, తెలుగు తమ్ముళ్లకు మాత్రమే ప్రభుత్వ ఫలాలు అందించి.. అంతులేని అక్రమాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలంతా సంపూర్ణంగా మద్దతు తెలిపి వైఎస్సార్‌సీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, పట్టణాధ్యక్షుడు నీలూరి ప్రకాష్, కోటిరెడ్డి బాలిరెడ్డి, నీలూరి ప్రకాష్, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్‌తో పాటు 40 వార్డుల కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

గీతాంజలిది ఆత్మహత్య కాదు.. టీడీపీ చేసిన హత్యే

ధర్మవరం: టీడీపీ సోషల్ మీడియా పైశాచికత్వానికి గీతాంజలి అనే మహిళ బలైందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే మంగళవారం ధర్మవరంలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'జగనన్న ప్రభుత్వం నాకు సహాయం చేసింది.. నాకు అండగా నిలబడింది' అని గీతాంజలి మాట్లాడితే.. దానికి సోషల్ మీడియాలో ఉన్న కొంతమంది సైకోలు కించపరిచే వ్యాఖ్యలు చేశారన్నారు. ఇలా ఒక్క గీతాంజలినే కాదు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వద్ద ఇంగ్లిష్‌లో మాట్లాడిన విద్యార్థిని మేఘనపై కూడా ట్రోల్ చేశారని గుర్తు చేశారు. చిన్నపాప ఇంగ్లిష్‌లో చక్కగా మాట్లాడితే ఓర్వలేని టీడీపీ సోషల్ మీడియా చిల్లరవ్యక్తులు.. ఒక గృహిణి తనకు ఇల్లు వచ్చిందని సంతోషపడి మాట్లాడితే ట్రోల్ చేస్తారా.. పోయిన గీతాంజలి ప్రాణాన్ని తిరిగి ఇస్తారా? అని ప్రశ్నించారు. 'పచ్చ' సైకోలు ఇలా సామాన్యుల జీవితాలు నాశనం చేయడం సిగ్గుచేటన్నారు. ఒకరిని కించపరిచేటప్పుడు తల్లిని, చెల్లిని, కుటుంబ సభ్యులను లాగడం చిల్లర లక్షణాలని అన్నారు. గీతాంజలి కుటుంబానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ రూ.20 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారన్నారు. తామంతా కూడా ఆమె కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు.

హత్య కేసులో మేనల్లుడి అరెస్ట్



ఆదిత్య శశాంక్‌ను అరెస్ట్ చూపిస్తున్న పోలీసులు

అనంతపురం: మేనమామ డాక్టర్ మూర్తిరావు భోకలేను దారుణంగా హత్య చేసిన కేసులో మేనల్లుడు ఆర్.ఎం.ఆదిత్య శశాంక్‌ను అనంతపురం వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ రెడ్డప్ప వెల్లడించారు. అనంతపురంలోని ఎల్ఐసీ కాలనీలో నివాసముంటున్న ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మూర్తిరావును ఈ నెల 10న హతమార్చిన విషయం తెలిసిందే.

మేనమామ మాట నమ్మి... చదువు మానేసి

పామిడి గ్రామానికి చెందిన మూర్తిరావుకు ఐదుగురు అక్కచెల్లెళ్లు, ఓ సోదరుడు ఉన్నారు. అందరితోనూ కలుపుగోలుగా ఉండేవారు. కుటుంబసభ్యులందరి బాగోగులను ఆయనే చూసుకునే వారు. ఈ క్రమంలో తన పెద్ద అక్క నాగరత్నాబాయి కుమారుడు ఆర్.ఎం.ఆదిత్య శశాంక్ తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీలో ఎంటెక్ చదువుతుండే వాడు. ఆ సమయంలోనే ఆదిత్యతో మూర్తిరావు మాట్లాడి చదువు మధ్యలోనే వదిలేసి అనంతపురానికి వస్తే మంచి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో ఆదిత్య శశాంక్ చదువు ఆపేసి మేనమామ వద్దకు చేరుకున్నాడు. అప్పటి నుంచి మేనల్లుడితో పాటు తన అక్క బాగోగులను ఆయన పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తూ వచ్చారు.

పథకం ప్రకారం..

మేనమామ మాట నమ్మి వచ్చిన తనతో పాటు తల్లి బాగోగులూ నిర్లక్ష్యం చేస్తూ వచ్చిన మేనమామ తీరు ఆదిత్యకు నచ్చలేదు. అంతా తాను చెప్పినట్లే జరగాలి.... అందరూ తన ఆధీనంలోనే ఉండాలన్న భావనతో తన కుటుంబాన్ని అణగదొక్కుతున్నారని మేనమామపై ఆదిత్య కసి పెంచుకున్నాడు. తన భవిష్యత్తును కాలరాసిన మేనమామను ఎలాగైనా మట్టుబెట్టాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో అనంతపురంలోని జేఎన్‌టీయూ ప్రధాన గేట్ ఎదురుగా ఉన్న మేనమామ ఇంటిలో అద్దెకు ఉంటున్న మణికంఠ అనే వ్యక్తి ఇల్లు ఖాళీ చేశాడు. ఈ నెల 10న రాత్రి ఇదే విషయాన్ని మూర్తిరావుకు మణికంఠ ఫోన్ చేసి తెలిపి, ఇంటి తాళం తీసుకెళ్లాలని సూచించారు. దీంతో తన భార్య శోభాబాయితో కలసి మూర్తిరావు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే అక్కడ కాపు కాసిన ఆదిత్య కత్తితో మూర్తిరావు గొంతుపై పొడిచి హతమార్చాడు.

రిమాండ్‌కు నిందితుడు

హత్య జరిగిన వెంటనే అప్రమత్తమైన అనంతపురం ఎస్పీ అన్బురాజన్ ఆదేశాల మేరకు డీఎస్పీ జి.వీరరాఘవరెడ్డి పర్యవేక్షణలో వన్‌టౌన్ సీఐ రెడ్డప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు రంగంలో దిగాయి. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టిన పోలీసులు మంగళవారం ఉదయం అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద తచ్చాడుతున్న ఆదిత్యశశాంక్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వినియోగించిన కత్తితో పాటు ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ఇద్దరిని బలిగొన్న క్షణికావేశం

ఆదిత్య శశాంక్ క్షణికావేశంతో దారుణానికి ఒడిగట్టడంతో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. తన కళ్ల ఎదుటే భర్తను మేనల్లుడు కత్తితో పొడిచి హత్య చేస్తున్న దారుణాన్ని చూసిన శోభాబాయి తట్టుకోలేకపోయింది. ఆ ఘటనను తలచుకుంటూ అదే రోజు రాత్రి 11 గంటలకు గుండెపోటుకు గురై మృతి చెందింది. దీంతో మూర్తిరావు కుటుంబం ఛిన్నాభిన్నమైంది. హతుడికి ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు.

వైభవంగా సిద్ధేశ్వరస్వామి చిన్న రథోత్సవం



సిద్ధేశ్వరస్వామి చిన్నరథాన్ని లాగుతున్న భక్తులు

హేమావతి(అమరాపురం): హేమావతి హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో మంగళవారం చిన్న రథోత్సవం వైభవంగా జరిగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారికి ప్రత్యేకంగా పూజలు చేయించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంజునాథ, ఈఓ నరసింహమూర్తి ఆధ్వర్యంలో సాయంత్రం ఉత్సవ విగ్రహాన్ని అర్చకులు అలంకరించారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఆలయ ఆవరణలో ఉన్న చిన్న రథం వద్దకు తీసుకెళ్లి కొలువుదీర్చారు. శివ... శివ, సిద్ధేశ్వరస్వామి మహారాజ్‌కు జై అంటూ భక్తులు అరటిపండు, పూలు, బెల్లం, బొరుగులు, జీలకర్ర తదితర వాటిని రథంపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. చిన్న రథాన్ని ఆలయం నుంచి హంపణ్ణస్వామి గుడివరకు లాగారు. రాత్రి ముత్యాల పల్లకీలో స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. సర్పంచ్ తిప్పేస్వామి ఆధ్వర్యంలో తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ జనార్దననాయుడు గట్టి పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

నేడు బ్రహ్మరథోత్సవం: సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో బుధవారం బ్రహ్మ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ నరసింహమూర్తి, ఆలయ కమిటీ చైర్మన్ మంజునాథ తెలిపారు.

పెనుకొండ గూడ్స్ షెడ్ ప్రారంభం



డీఎంఈకి వినతిపత్రం అందిస్తున్న పట్టణ ప్రముఖులు

పెనుకొండ: పట్టణంలోని గూడ్స్‌షెడ్‌ను మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు పట్టణ వాసులు, రైల్వే అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రైల్వేశాఖ సీనియర్ డీఎంఈ అజీముద్దీన్, హెచ్‌ఆర్‌సీ నాయకులు షమీవుల్లా, రైల్వే కాంట్రాక్టర్ గుట్టూరు ఆంజనేయులు, కౌన్సిలర్ రఘునాథరెడ్డి, సుధాకర్‌గుప్తా, బీజేపీ నాయకులు రామకృష్ణ, రామాంజనేయులు, హనుమంతు, రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆపరేటింగ్ మేనేజర్ అమిత్‌సింగ్ పాల్గొన్నారు. రైల్వే అధికారులు రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక రైల్వేస్టేషన్‌లో కుర్లా, బసవ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా చూడాలని, పట్టణంలోని రోడ్డుకు అనుగుణంగా డబుల్ లైన్ వేసి లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు కోసం మరిన్ని షెల్టర్లు, డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతూ సీనియర్ డీఎంఈకి వినతి పత్రం అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మృతుడు ఆదెప్ప

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని సీతారాంపల్లి క్రాస్ వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి. కనగానపల్లి మండలం చంద్రాచర్ల గ్రామానికి చెందిన ఆదెప్ప (60), నాగభూషణంలు ద్విచక్ర వాహనంపై మామిళ్లపల్లికి వెళుతుండగా బెంగళూరు వైపు నుంచి అనంతపురం వైపు వెళ్లే కారు ఢీకొంది. ఆదెప్ప తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రగాయాలైన నాగభూషణంను అనంతపురంలోని ఓ ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. ఆదెప్పకు భార్య సాలమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

పన్ను బకాయిలు వసూలు చేయండి



రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీఓ విజయ్‌కుమార్‌రెడ్డి

తనకల్లు: పన్ను బకాయిలను వెంటనే వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) విజయ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. తనకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. పాత, కొత్త పన్నులు కలిపి రూ.19 లక్షల దాకా బకాయిలు ఉన్నాయన్నారు. అధికారులు పన్నుల వసూలుపై దృష్టి సారించాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులు యూనిఫాం ధరించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాజేంద్ర రిజిస్టర్‌లో సంతకం చేయకపోవడంతో మెమో జారీ చేయాలని కార్యదర్శి కృష్ణమూర్తిరెడ్డిని ఆదేశించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

చిలమత్తూరు: గాడ్రాళ్లపల్లి శివారులో పేకాట ఆడుతున్న 11 మందిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.1.51 లక్షల నగదు, 11 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. నిందితుల్లో ఓ సీఐ డ్రైవర్ ఉండటం గమనార్హం.

పోతలయ్యస్వామి పరుష ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో పోతలయ్యస్వామి

కనగానపల్లి: దాదులూరు పోతలయ్యస్వామి పరుష మంగళవారం ప్రారంభమైంది. తొలిరోజు రామగిరి మండలంలోని స్వామి కాపులు యలవగంపలో స్వామి ఆభరణాలు, పూలహారాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. తర్వాత వాటిని స్వామికి అలంకరించి ప్రత్యేకంగా పూజలు చేశారు. చెన్నేకేశవస్వామి దేవాలయంలో పలువురు భక్తులు సమారాధన కార్యక్రమం చేపట్టి అన్నదానం నిర్వహించారు. జాతరలో రెండోరోజు బుధవారం పోతలయ్య, చెన్నేకేశవస్వాములకు భక్తులు జ్యోతులు, బోనాలు సమర్పిస్తారు. ఇక ఈ జాతరలో టెంకాయలు, ప్రసాదాలు విక్రయించేందుకు నిర్వహించిన వేలం పాటల్లో టెంకాయలకు రూ.2.5 లక్షలు, ప్రసాదాలకు రూ.90 వేలు వచ్చినట్లు ఆలయ ధర్మకర్త రామలింగారెడ్డి తెలిపారు.

ఉద్యోగాల కల్పనలో ఏపీ టాప్



ఉద్యోగాలకు ఎంపికైన వారితో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం

పుట్టపర్తి: యువతకు ఉద్యోగాల కల్పనలో ఏపీ టాప్‌లో ఉందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. మంగళవారం బుక్కపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖయ్యూం మాట్లాడుతూ 309 మంది అభ్యర్థులు హాజరు కాగా 13 కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు చేశారన్నారు. వీరిలో 152 మంది యువతీ యువకులు ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. వీరికి నియామకపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శివరంగ ప్రసాద్, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆవుటాల రమణారెడ్డి, సర్పంచ్ నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్, సచివాలయాల కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ గ్రీప్

హిందూపురం అర్బన్: పట్టణ, గ్రామీణ యువతకు ఉన్నచోటే ఉద్యోగ అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) డైరెక్టర్ డాక్టర్ ఎస్.జి. గ్రీప్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బిట్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఖాదీ గ్రామీణ పరిశ్రమలకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు స్థాపించడం ద్వారా ఉపాధి మార్గాలను కల్పించవచ్చన్నారు. యువతకు స్వయం ఉపాధి భరోసా కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం ద్వారా రూ.లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాన్ని అందిస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రమేష్ తెలిపారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని తపన ఉన్న ఔత్సాహికులకు ఈ పథకాలు ఎంతగానో ఉపయోగ పడుతాయని కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.జి.రావు, ఆర్‌ఎల్‌ఎన్ మూర్తి తెలియజేశారు. కార్యక్రమానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్ జియావుల్లా, కేవీబీ అసిస్టెంట్ మేనేజర్ జగన్నాథ్‌రెడి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ శివనారాయణరెడ్డి, డీపీఓ కోటిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకుల బలవన్మరణం

సోమందేపల్లి/ పెనుకొండ రూరల్: వేర్వేరు చోట్ల ఇద్దరు యువకులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఆయా కుటుంబాల్లో తీరనివిషాదం అలుముకుంది. వివరాలిలా ఉన్నాయి. సోమందేపల్లి మండలం ముద్దపుకుంటకు చెందిన శివానంద (28) ఆర్థిక ఇబ్బందులు భరించలేక సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పునకు చీరతో ఉరివేసుకున్నాడు. కాసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. ఇతడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

- పెనుకొండ సమీపంలోని కియా పరిశ్రమలో పని చేస్తున్న గుంటూరు జిల్లా నరసరావుపేటకు చెందిన చేకొద్ది సురేష్ (30) మంగళవారం సాయంత్రం కొండాపురం వద్ద రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్‌ఐ బాలాజీనాయక్ కేసు నమోదు చేశారు.

లక్ష్య సాధన దిశగా డీసీసీబీ

- నెలాఖరుకు రూ.2 వేల కోట్లు లక్ష్యం
- డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఎం.లిఖిత

అనంతపురం అగ్రికల్చర్: ప్రస్తుత 2023–24 ఆర్థిక సంవత్సరం వ్యాపార లక్ష్య సాధన దిశగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) అడుగులేస్తోందని ఆ బ్యాంక్ చైర్‌పర్సన్ ఎం.లిఖిత తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసేలోపు రూ.2 వేల కోట్ల వ్యాపార లక్ష్యం నిర్దేశించుకోగా, ఇప్పటికే 1,900 కోట్ల టర్నోవర్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతపురంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో పాలవర్గ సమావేశం మంగళవారం జరిగింది. చైర్‌పర్సన్ మాట్లాడుతూ... రైతులకు పెద్ద పీట వేస్తూనే మిగిలిన అన్ని వర్గాల ఆర్థికాభివృద్ధికి పాలకవర్గం, అధికారులు సమన్వయంతో పనిచేస్తుండాన్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో ఈ నెలాఖరుకు రూ.2 వేల కోట్ల లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని సూచించారు. నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) గణనీయంగా తగ్గించడంలో భాగంగా మొండిబకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహంతో రైతులు, వ్యవసాయ రంగానికి పెద్ద ఎత్తున రుణాలు ఇచ్చామన్నారు. డీసీసీబీ ద్వారా అన్ని వర్గాలకు లబ్ధి జరిగేలా ప్రభుత్వ ప్రయోజనాలు వర్తింపజేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సీఈఓ ఏబీ రామ్‌ప్రసాద్, డైరెక్టర్లు వై.జనార్దన్‌రెడ్డి, హైదర్‌వలీ, రామాంజినేయులు, ప్రొఫెషనల్ డైరెక్టర్లు రమణమూర్తి, జనరల్ మేనేజర్ కె.సురేఖారాణి, డీజీఎం సుఖదేవబాబు, ఆప్కాబ్ డీజీఎం సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.